రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



# బడుగుల ఉన్నతికి రిజర్వేషన్లే బ్రహ్మాస్త్రం

**అంబేద్కర్ ఒక పేరు మాత్రమే కాదు**

**దేశ ప్రజల జీవన రేఖ**

**ఆయన ఆశయ సాధనకోసమే రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు**

**స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** వికారాబాద్ పట్టణంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాలు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెందడానికి అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ బద్ధమైన రిజర్వేషన్లే ప్రధాన కారణమన్నారు. పూరి గుడిసెల్లో, గిరిజన గూడేల్లో పుట్టిన వారు కూడా నేడు దేశ అత్యున్నత పదవులను అలంకరిస్తున్నారంటే అది అంబేద్కర్ అందించిన రిజర్వేషన్లు అనే బ్రహ్మాస్త్రం వల్లే సాధ్యమైందని ఆయన కొనియాడారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే తాను నేడు శాసనసభాపతి వంటి అత్యున్నత పదవిలో ఉన్నానని స్పీకర్ తెలిపారు. అంబేద్కర్ అనేది ఒక పేరు మాత్రమే కాదని, అది ఈ దేశ ప్రజల జీవన రేఖ అని ఆయన అభివర్ణించారు. రాజ్యాంగంలోని చిన్న రాష్ట్రాల ఏర్పాటు అంశం వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు.

**విద్యా రంగానికి ప్రాధాన్యం**

ప్రతి నియోజకవర్గంలో 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నట్లు స్పీకర్ వెల్లడించారు. దీని ద్వారా దళిత, గిరిజన, బీసీ వర్గాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్య అందుతుందని, ఒకటవ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు ఉదయం అల్పాహారం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

యువత అంబేద్కర్ పోరాట స్ఫూర్తితో తమ లక్ష్యాలను సాధించి ఉన్నత స్థానాలకు ఎదగాలని, అప్పుడే ఆయనకు మనం నిజమైన నివాళులు అర్పించినట్లు అవుతుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, అడిషనల్ కలెక్టర్ ఉమాశంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య, జడ్పీ సీఈఓ సుధీర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న రంగారెడ్డి కలెక్టర్

# అంబేద్కర్ ఆశయాలే సమాజానికి దిక్సూచి

**రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ నిర్మాత, జ్ఞాన ప్రదాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ట్యాంక్‌బండ్ వద్ద అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సామాజిక న్యాయం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన చూపిన బాట సమానత్వం, విద్య, మరియు స్వాభిమానం అనే పునాదులపై నిర్మితమైందని, ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టినప్పుడే నిజమైన సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, కేవలం విద్య ద్వారానే సామాజిక ఆర్థిక పురోగతి సాధ్యమని, అంబేద్కర్ అడుగుజాడల్లో నడిచి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు. భారతదేశం నేడు ప్రపంచంలోనే గొప్ప ప్రజాస్వామ్య, సమానత్వ దేశంగా వెలుగొందుతోందంటే అది అంబేద్కర్ గారి దూరదృష్టి వల్లేనని, రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకలో జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి రామరావు, వివిధ సంఘాల ప్రతినిధులు మరియు ఇతర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆశల వంతెన అడుగడుగునా వంచన



అసంపూర్తిగా చింతకుంట వంతెన

## వారధికి పునాది రాయి వేసి 14 యేళ్లు!

**పూర్తి చేయాలన్న సోయి ఏది? - నదిలో పిల్లర్లు సాక్షిగా.. పాలకుల వైఫల్యం బట్టబయలు - మూడు కిలోమీటర్ల దూరానికి ఎనిమిది కిలోమీటర్ల నరకం - వర్షాకాలంలో నరకప్రాయం - మునిగిపోతున్న గిరిజన పల్లెలు! ప్రభుత్వాలు మారినా.. తలరాత మారని ధారూర్ గ్రామాలు!**



- అత్యవసరమైతే చావే శరణ్యమా?

రవాణా సౌకర్యం లేక డోలీలో రోగిని తీసుకెళుతున్న దృశ్యం

**పాలకులు మారుతున్నారు.. ప్రభుత్వాలు మారుతున్నాయి.. కానీ ఆ గ్రామాల ప్రజల రవాణా సౌకర్యాలు మాత్రం మెరుగుపడటంలేదు. దశాబ్దాల కలగా మిగిలిపోయిన వంతెన నిర్మాణం, నేటికీ అటకెక్కి ఉండటం పాలకుల చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది. అదనపు కిలోమీటర్ల ప్రయాణం నరకప్రాయంగా మారుతున్నా, అత్యవసర సమయాల్లో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా ఏ ఒక్క అధికారి గానీ, ప్రజాప్రతినిధి గానీ కనికరించకపోవడం శోచనీయం. కేవలం ఓట్ల కోసమే గ్రామాల్లోకి అడుగుపెట్టే నాయకుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.**

**ధారూర్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** పాలకులు మారుతున్నారు, ప్రభుత్వాలు మారుతున్నాయి. కానీ గ్రామాల ప్రజల రవాణా కష్టాలు మాత్రం తీరడం లేదు. ధారూర్ మండల పరిధిలోని చింతకుంట, హరిదాసు పల్లి, మైలారం, కొత్తతండా గ్రామస్తుల దశాబ్దాల కల అయిన వంతెన నిర్మాణం నేటికీ అటకెక్కి ఉండడం పాలకుల ఉదాసీనతకు అద్దం పడుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, 2010వ సంవత్సరంలో అప్పటి మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఎంతో ఆర్భాటంగా కాగ్నా ఉపనదిపై ఈ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గిరిజన సంక్షేమ శాఖ నిధులతో ధారూర్ నుంచి చింతకుంట వరకు బీటీ రోడ్డు నిర్మించి, నదిలో పిల్లర్లను కూడా వేశారు. అయితే ఆ పిల్లర్లు వేసిన తర్వాత పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ ఒక్క అధికారి గానీ, ప్రజాప్రతినిధి గానీ ఈ వంతెన పూర్తి చేయాలనే చొరవ చూపకపోవడం గమనార్హం.

**చుట్టూ తిరిగితేనే ధారూర్..**

ఈ వంతెన లేకపోవడం వల్ల నాలుగు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెన ఉంటే ధారూర్ మండల కేంద్రానికి కేవలం 3 కిలోమీటర్ల దూరమే ఉంటుంది. కానీ నిర్మాణం పూర్తి కాకపోవడంతో, ముఖ్యంగా వర్షాకాలంలో నది ప్రవహిస్తున్నప్పుడు ప్రజలు వేరే మార్గంలో సుమారు 8 కిలోమీటర్ల దూరం చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి వెళ్లాలన్నా, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలన్నా ఈ అదనపు ప్రయాణం ప్రజలకు నరకప్రాయంగా మారింది.

**ఎన్నికల హామీలన్నీ గాలికేనా : గ్రామస్తుల ఆగ్రహం**

కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ సమస్య తీరుతుందని ఆశించిన గ్రామస్తులకు నిరాశే మిగులుతోంది. స్థానిక శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టికి ఈ సమస్యను పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ, ఇప్పటి వరకు ఎటువంటి స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు. ఎన్నికల సమయంలోనే కనిపించే ప్రజాప్రతినిధులు, గెలిచిన తర్వాత తమ గోడు పట్టించుకోరని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పీకర్, సంబంధిత అధికారులు స్పందించి ఆగిపోయిన వంతెన పనులను వెంటనే ప్రారంభించి, తమ రవాణా కష్టాలను తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మ్యాట్రిమోనీలో యువతులకు పెళ్లి వల..

**సిఐఎస్ఎఫ్ యూనిఫామ్‌లో హల్‌చల్**

**ఖరీదైన దుస్తులతో ఫొటోలు పంపి ఉన్నతస్థాయి అధికారినంటూ బిల్డప్**

**67 మందిని చీటింగ్**

**శంషాబాద్ ఎయిర్పోర్ట్‌లో నకిలీ అధికారి ఆటకట్టించిన పోలీసులు**




శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టుబడిన నకిలీ సీఐఎస్ఎఫ్ అధికారి బాలకృష్ణ

**శంషాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** విమానాశ్రయ భద్రతా వలయంలోనే తిరుగుతూ, అధికారిగా చలామణి అవుతున్న ఓ కేటుగాడి బాగోతం ఎట్టకేలకు రట్టయింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సిఐఎస్ఎఫ్ యూనిఫామ్ ధరించి అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో నమ్మలేని నిజాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసుల విచారణలో తేలిన వివరాల ప్రకారం..ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన బాలకృష్ణగా గుర్తించబడిన ఈ నిందితుడు, ఖరీదైన యూనిఫామ్ ధరించి తాను ఉన్నత స్థాయి అధికారిని అని నమ్మిస్తూ ఎయిర్‌పోర్టులో హల్చల్ చేస్తున్నాడు. కేవలం ఎయిర్‌పోర్టులో హడావుడి చేయడమే కాదు, ఇతని అసలు స్వరూపం మ్యాట్రిమోనీ సైట్లలో బయటపడింది. సుమారు 67 మంది యువతులకు తన ఫేక్ ప్రొఫైల్స్, ఖరీదైన దుస్తులతో కూడిన ఫోటోలను పంపి వారిని మోసగించాడు. తన మాటలతో వారిని బుట్టలో వేసుకోవడం, పెళ్లి పేరుతో నమ్మించి వారి వద్ద నుంచి భారీగా నగలు, నగదు వసూలు చేసి చెక్కేయడం ఇతనికి నిత్యకృత్యంగా మారింది.

**అధికారుల నిఘాతో చిక్కిన వైనం**

ఇతని ప్రవర్తనపై గత కొంతకాలంగా నిఘా ఉంచిన అధికారులు, పక్కా పథకం ప్రకారం వల వేసి పట్టుకున్నారు. నిందితుడి నుంచి నకిలీ సీఐఎస్ఎఫ్ సామాగ్రిని, ఖరీదైన దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. మ్యాట్రిమోనీ సైట్ల ద్వారా పరిచయమయ్యే ఇలాంటి మోసగాళ్ల పట్ల యువతులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. ప్రస్తుతం నిందితుడిని విచారిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.



# ప్రయాణికుడి బ్యాగ్‌లో పేలిన మొబైల్

**స్కానింగ్ చేస్తుండగా బ్యాటరీ విస్ఫోటనం**

**ఒక్కసారిగా చెలరేగిన పొగలు.. భయాందోళనలో ప్రయాణికులు!**

**తృటిలో తప్పిన ప్రమాదం**

**శంషాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం ఉదయం ఒక్కసారిగా కలకలం రేగింది. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌కు వెళ్లేందుకు వచ్చిన ఒక ప్రయాణికుడి బ్యాగును విమానాశ్రయ నిబంధనల ప్రకారం స్కానింగ్ చేస్తుండగా, అందులోని సెల్ ఫోన్ బ్యాటరీ హఠాత్తుగా పేలిపోయింది. బ్యాటరీ పేలడంతో ఒక్కసారిగా పొగలు రావడంతో అక్కడున్న ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.
వెంటనే అప్రమత్తమైన భద్రతా మరియు ఫైరింగ్ సిబ్బంది తగిన చర్యలు చేపట్టారు. ఈ అనూహ్య ఘటన కారణంగా రాయపూర్ వెళ్లాల్సిన విమానం ఆలస్యంగా బయలుదేరింది.

# చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీ మృతి

**ఆమనగల్లు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** తన భార్య మరియు కుమారుడిని అత్యంత దారుణంగా హత్య చేసిన కేసులో నిందితుడిగా ఉన్న రిమాండ్ ఖైదీ మంగళవారం మరణించాడు. ఆమనగల్ మండలం పులిగోనిపల్లి తండాకు చెందిన బాణావత్ రాందాస్ నాయక్, గత మార్చి 31న తన భార్య కవిత మరియు కుమారుడు హర్షిత్‌ను రోకలిబండతో బాది హత్య చేశాడు. ఈ కేసులో అరెస్టై చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న రాందాస్ నాయక్, మూర్ఛ వ్యాధితో కిందపడి మరణించినట్లు ఆమనగల్లు ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు ధృవీకరించారు .



ధ్వంసమైన బిటి రోడ్డు

# బిటి రోడ్డుపై ట్రాక్టర్ పంజా!

**పనులు ముగిసిన మూడు రోజులకే ధ్వంసం**

**రావులపల్లి సమీపంలో దుండగుల అరాచకం**

**మర్పల్లి, ఏప్రిల్ 14 ప్రభాతవార్త:** ప్రభుత్వ నిధులు వెచ్చించి ప్రజల సౌకర్యార్థం నిర్మించిన బీటీ రోడ్డు అరాచకానికి గురైంది. మర్పల్లి మండలంలోని రావులపల్లి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు పనులు పూర్తయి కనీసం మూడు రోజులు కూడా గడవకముందే గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డును ధ్వంసం చేశారు. రావులపల్లి గ్రామానికి కిలోమీటరు దూరంలో రోడ్డును ట్రాక్టర్ నాగలితో సుమారు రెండు మూడు మీటర్ల మేర దున్నివేయడం స్థానికంగా కలకలం రేపుతోంది. ఇది ఎవరో కావాలనే చేశారా లేక ప్రమాదవశాత్తు జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొత్తగా వేసిన రోడ్డు ఇలా అప్పుడే పాడైపోవడంపై ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయకపోతే రాకపోకల వల్ల అది మరింత అధ్వానంగా తయారయ్యే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు ఈ ఘటనపై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




**ఖాల్సా పంథ్ స్థాపనకు గుర్తుగా జరుపుకునే వైశాఖి పండుగను తెలంగాణ సిక్కు సమాజం మంగళవారం భక్తి, శ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించింది. అమీర్‌పేట్‌లోని గురుద్వారా సాహెబ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది సిక్కు భక్తులు తరలి వచ్చారు.**

# వికారాబాద్‌లో అరైవ్ అలైవ్ గర్జన



ప్రతిజ్ఞ చేయిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

**రోడ్డు భద్రతపై కదంతొక్కిన యంత్రాంగం**

**నిబంధనల అమలుతోనే ప్రమాదాలకు చెక్: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

**యెన్నెపల్లి చౌరస్తాలో ప్రతిజ్ఞ**

**ప్రమాద రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం: జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వికారాబాద్ పట్టణంలో అరైవ్ అలైవ్ కార్యక్రమం హోరెత్తింది. పోలీసు శాఖ ఆధ్వర్యంలో రెండో రోజు నిర్వహించిన ఈ అవగాహన గర్జనలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు. నిబంధనలు పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాలను అరికట్టడం సాధ్యమవుతుందని ఆయన ఉద్ఘాటించారు. పట్టణంలోని యెన్నెపల్లి చౌరస్తాలో ఉన్న డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం సాక్షిగా, ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తామని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ స్నేహ మెహ్రాతో కలిసి ప్రజలందరూ భారీ ఎత్తున రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేశారు.

**మద్యం తాగి నడిపితే ప్రమాదమే**

ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. రహదారి ప్రమాదాలకు ప్రధాన కారణం మద్యం సేవించి వాహనాలు నడపడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతాల వరకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచాలని, ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ బాధ్యతగా వాహనాలు నడపాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా ప్రతి పౌరుడు క్రమశిక్షణతో వ్యవహరించినప్పుడే ప్రమాద రహిత జిల్లా సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

**అంబేద్కర్ ఆశయాలతో క్రమశిక్షణ**

జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి పౌరుడు క్రమశిక్షణతో నిబంధనలు పాటించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో రహదారి భద్రతను మెరుగుపరిచేందుకు గ్రామ స్థాయిలో రోడ్డు సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేశామని, అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

# విదేశీ ఉద్యోగాల పేరుతో మోసం

**ఇద్దరు అరెస్ట్ - పరారీలో ఎనిమిది మంది**

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి నిరుద్యోగుల నుంచి లక్ష లాది రూపాయలు దోచుకుంటున్న ముఠాను జూబ్లీహిల్స్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ట్రివియల్ చాప్టర్ సంస్థకు చెందిన ఇద్దరు నిం దితులను అరెస్ట్ చేశారు. జూబ్లీహి ల్స్ పోలీసుల కథనం ప్రకారం... యూరప్ దేశాలైన గ్రీస్, రొమేనియా తదితర ప్రాంతాల్లో వర్క్ వీసాలు కల్పిస్తామని చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు వసూలు చేశారు. డబ్బులు తీసుకున్న అనంతరం నకిలీ ఆఫర్ లెటర్లు ఇచ్చి, తర్వాత బాధితులతో సంబంధాలు తెంచుకొని మోసానికి పాల్పడ్డారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికలను వినియోగించి తమను ఓవర్సీస్ కన్స లెన్సీగా ప్రచారం చేసుకున్న నిందితులు, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అనుమతి లేకుండానే కార్యకలాపాలు కొనసాగించినట్లు పోలీసులు తెలిపారు. బాధితులను నమ్మించేందుకు నకిలీ వర్క్ ఆథరైజేషన్ పత్రాలు కూడా తయారు చేసి అందజేసినట్లు వెల్లడించారు. ఈ కేసులో వైస్ ప్రెసి డెంట్ - సౌత్ జోన్ లంక నిరుపమ, తెలంగాణ రీజినల్ మేనేజర్ మామిడి అరుణ్ రాజ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంస్థ ఫౌండర్, సీఈఓ, వీసా హెడ్ సహా మరో ఎనిమిది మంది పరారీలో ఉండగా, వారి కోసం గాలింపు చేపడుతున్నట్టు తెలిపారు.



# నృసింహుడి కళ్యాణం.. అంగరంగ వైభవం!

**కీసర, ఏప్రిల్ 14 ప్రభాతవార్త:** చీర్యాల లక్ష్మీనృసింహ స్వామి తిరు కళ్యాణ మహోత్సవం అశేష భక్తజన సందోహం మధ్య మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండో రోజు స్వామి వారికి నవకలశాభిషేకం, సుదర్శన నారసింహ్మ హోమం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ దంపతుల చేతుల మీదుగా స్వామివారి తిరుకళ్యాణ ఘట్టం అత్యంత వేడుకగా సాగింది. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారికి చైర్మన్ లక్ష్మీనారాయణ పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కళ్యాణ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఐఏఎస్ నవీన్ మిట్టల్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయలు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. విచ్చేసిన ప్రముఖులకు ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ వేద పండితులతో కలిసి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మల్లారపు శ్రీ హరిగౌడ్, నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఉచితకంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**పూడూరు,ఏప్రిల్ 14, ప్రభాతవార్త :** ఉచితకంటి వైద్యశిభిరాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు బి సుభాష్ అన్నారు.డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా మంగళవారం పూడూరు మండలం పరిధిలోని పెద్దఉమ్మెంతాల్ గ్రామంలో పంచాయతీ పాలకవర్గంతో కలిసి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళ్లు అర్పించారు.అనంతరం స్థానిక రైతువేదికలో ఏర్పాటుచేసిన ఉచితకంటి వైద్యశిభిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధ పడుతున్న వారికోసం గ్రామంలో ముక్తేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ అద్వర్యంలో రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు చేసి మాత్రలు ఇవ్వడంతోపాటు అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్‌లు చేయించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ఫౌండర్ ముత్తు గీతాంజలి,వైద్యులు డాక్టర్ సాజిదాఖాన్,సిబ్బంది మంజుల, రాంకుమార్,నవనీత్,నాయకులు శ్రీకాంత్,ఖరీంపాష,మల్లేష్,వెంకటయ్య ,క్రిష్ణారెడ్డి,బుచ్చిరెడ్డి, తిర్మల్‌రెడ్డి,ప్రవీణ్,శ్రీనివాస్‌రెడ్డి,నర్సింలు,ఖలీల్,తదితరులు పాల్గొన్నారు.



పూడూరు మండలం పెద్దఉమ్మెంతాల్ ఉచితవైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు,తదితరులు

## రోడ్డు భద్రత నియామాలు పాటిస్తాం

**ఆమనగల్లు,ఏప్రిల్14, ప్రభాతవార్త:** రోడ్డు భద్రత నియమాలను అతిక్రమించకుండా తూ.చ పాటిస్తామని పలువురు ప్రజాప్రజానిధులు, పలు రంగాల ప్రముఖులు, అధికారులు మంగళవారం ప్రతిజ్ఞ చేశారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మున్సిపాలిటీ చైర్మన్ నేనావత్ పత్యానాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతనర్సింహ్మా, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరైనారు. ఈసంధర్భంగా ముఖ్య అతిథులతో కలిసి అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈమేరకు చైర్మన్లు పత్యానాయక్, యాటగీత నర్సింహా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ విధిగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. నిర్లక్ష్యం, అతివేగం, అజాగ్రత్తలతోనే అధిక రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు భద్రత నియమాల పాటించడం మూలంగా ప్రమాదాలను అరికట్టి ఎందరో ప్రాణాలను అరికట్టవచ్చని సూచించారు. కార్యక్రమంలో అధికారులు ఎంపీడీఓ కుసుమ మాధురి, ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు నాగిళ్ల జగన్, ఎర్రవోలు మహేశ్, అనుముల రమేశ్, గుర్రం కేశవులు, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, వస్పుల శ్రీశైలం, కృష్ణనాయక్, వస్పుల సాయిలు తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, ప్రజలు

## రాష్ట్రాలు తిరిగేస్తున్న యాత్రికునికి ఘన స్వాగతం

**ఆమనగల్లు, ఏప్రిల్14, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా పాదయాత్ర చేస్తూ సామాజిక చైతన్యం, రాష్ట్రాల సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన చేసుకోవడానికి రాష్ట్రాలను చుట్టేస్తున్న ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన యాత్రికుడు యువకుడు మున్వర్‌కు మంగళవారం ఆమనగల్లులో ఘన స్వాగతం లభించింది. కౌన్సిలర్ ఎర్రవోలు మహేశ్ యాత్రికుడిని మర్యాదపూర్వకంగా కలుసుకుని స్వాగతం పలికారు. కౌన్సిలర్ మహేశ్ సాహసయాత్ర గురించి అతన్ని వివరాలు అడగగా గత 8 నెలల క్రితం ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని తన స్వగ్రామం నుండి యాత్ర ప్రారంభించానని, ఇప్పటికే దాదాపు ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్, కేరళ రాష్ట్రాలతోపాటు దేశంలోని సగం రాష్ట్రాలను చుట్టేసి తెలుగు రాష్ట్రాలలోకి ప్రవేశించానని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం పుణ్యక్షేత్రంను సందర్శించుకుని తెలంగాణలోకి ప్రవేశించి రాజధానికి బయలుదేరుతున్నట్లు ఆయన వివరించారు. పెట్రోల్‌బంకులు, దేవాలయాలలో బస, హోటళ్ళు, ఇతర ప్రాంతాలలో ఆహారం స్వీకరిస్తానని చెప్పారు. ఈసందర్భంగా మహేశ్ యాత్రికునికి నీరు, మజ్జిగ అందించి వీడ్కోలు పలికారు. స్వాగతం పలికిన వారిలో మాజీ కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్, సంజీవ్‌కుమార్, అబ్బు, వరికుప్పల శ్రీనివాస్, ఎంగలి యాదగిరి, దోర్నాలు ఈశ్వరయ్య, కోట్ల వెంకటేశ్, కర్ణాకర్, పర్వతాలు తదితరులు ఉన్నారు.



యాత్రికుడు మున్వర్‌ను కలుసుకున్న కౌన్సిలర్ మహేశ్

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**-26 ఏళ్ల తర్వాత ఒక్కటైన నేస్తాలు -గురువుల సమక్షంలో చిన్ననాటి జ్ఞాపకాల సందడి..**

**దౌల్తాబాద్,ఏప్రిల్ 14,ప్రభాతవార్త:** కాలం పరుగులు తీస్తున్న చిన్ననాటి స్నేహాలు మాత్రం ఎప్పటికీ పచ్చగానే ఉంటాయని చల్లాపూర్,ఈర్లపల్లి పూర్వ విద్యార్థులు నిరూపించారు.దౌల్తాబాద్ మండంలోని చల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో 1999–2000 విద్యా సంవత్సరానికి చెందిన చల్లాపూర్,ఈర్లపల్లి పూర్వ విద్యార్థులు మంగళవారంరోజు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.దాదాపు 26 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మిత్రులంతా ఒకే చోట చేరడంతో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది.తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ఈ సంధర్భంగా విద్యార్థులు ఘనంగా సన్మానించారు.వారి పాదాలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. పలక బలపం పట్టిన రోజుల నుండి,నేటి బాధ్యతాయుతమైన స్థాయి వరకు తాము సాగించిన ప్రయాణాన్ని ఒకరకొకరు పంచుకున్నారు.చదువుకున్న గదులను చూసి మురిసిపోయారు.ఈ వేడుకలో ఈర్లపల్లి,చల్లాపూర్ ప్రాథమిక పాఠశాలల పూర్వ విద్యార్థులతో పాటు నాటి గురువులు ప్రత్యేక ఆకర్షనగా నిలిచారు.పాతికేళ్లు దాటినా మమ్మల్ని గుర్తించుకొని,ఇలా గౌరవించడం మాకెంతో గర్వంగా ఉందని,విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండటమే గురువులకు ఇచ్చే నిజమైన గురుదక్షిణ అని అన్నారు.ఈ సంధర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ..ఉరుకుల పరుగుల జీవితంలో చిన్ననాటి మిత్రులను కలుసుకోవడం ఎంతో ఉపశమనాన్ని ఇచ్చిందని తెలిపారు.పాఠశాలతో తమకున్న అనుబంధం మరువలేనిదని, భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుదర్శన్‌రెడ్డి,గోపాల్ నాయక్,రాములునాయక్, కిష్టయ్య,కృష్ణయ్య,మల్లేషం ,సాయప్ప, అనంతయ్యలతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. భోజన విందు అనంతరం ఒకరినొకరు వీడ్కోలు పలుకుతూ భావోద్వేగానికి లోనయ్యారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

## పోయిన మొబైల్ ఫోన్‌ను అందజేసిన ఎస్ఐ భరత్ భూషణ్

**మోమిన్‌పేట్, ఎప్రిల్, 14. ప్రభాతవార్త:** మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే ఆలస్యం చేయకుండా సమీప పోలీస్ స్టేషన్‌లో ఐఎమ్ఇఐ నెంబరు ద్వారా పిర్యాదు చేయాలని మోమిన్‌పేట్ ఎస్ఐ భరత్ భూషణ్ పేర్కొన్నారు. మంగళవారం మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్ లో విజయవాడ నగరానికి చెందిన బొల్లిపోగు పుల్లారావు తండ్రి పేరయ్య, నివాసం రామరాజ్యనగర్ ఆంధ్రప్రదేశ్ కు చెందిన వ్యక్తి 06.11.2025న, ఉదయం 10.గంటల సమయంలో తను పనిచేసే కార్యాలయానికి వెళ్తున్నపుడు వీవో వై100, మొబైల్ విజయవాడ పరిసర ప్రాంతాల్లో కోల్పోయాడు. ఈ నేపథ్యంలో పిర్యాదుదారుడు విజయవాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, బాధితుడు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ మోమిన్‌పేట్ మండల పరిధిలో ఉందనే విశ్వసనీయ సమాచారంతో, సంబందిత విధానాల ప్రకారం అట్టి ఫిర్యాదును మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. తదుపరి మోమిన్‌పేట్ ఎస్ఐ భరత్ భూషణ్ ఆద్వర్యంలో సీఇఐఆర్,సిసిటీఎన్ఎస్ ఆపరేటర్ మల్లీశ్వరి సమన్వయ కృషితో పోయిన మొబైల్ ఫోన్‌ను విజయవంతంగా ట్రాప్ చేసి స్వాధీనం చేసుకొని, 14.04.2026. మంగళవారం ఫిర్యాదుదారుని కుమారుడు నిఖిల్‌ను సంప్రదించి, మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విలువైన మొబైల్ ఫోన్‌ను సురక్షితంగా అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతు మొబైల్ కొనుగోలు సమయంలో తీసుకున్న బిల్లు, ఐఎంఇఐ నెంబరును తప్పకుండా భద్రపరుచుకోవాలని, వ్యక్తిగత సమాచారం, ఓటీపి, బ్యాంకు వివరాలు, పాస్‌వార్డు ఎవ్వరికి తెలియకుండా ఉండాలని, మొబైల్ స్క్రీన్ లాక్, ట్రాకింగ్ యాప్స్, మొబైల్ పోగొట్టుకున్న వ్యక్తులు వెంటనే సమాచారం అందిస్తే ఎక్కడున్నా, ఎన్ని రోజులైనా మొబైల్‌ను స్వాధీనం చేసుకొని బాధితులకు అందజేయడం జరుగుతుందని ఎస్ఐ భరత్ భూషణ్ తెలిపారు. మొబైల్ దక్కిన సంధర్భంగా బాధితుడు ఆనందంతో పోలీసులకు ధన్యవాదములు తెలిపాడు.



పోయిన మొబైల్‌ను అందజేస్తున్న ఎస్ఐ, పోలీసులు

# డబుల్‌బెడ్‌రూమ్స్ కాలనీలలో వాణిజ్య సముదాయాలకి వేలం

- **డబుల్‌బెడ్‌రూమ్స్ కాలనీల వద్ద ఉన్న వాణిజ్య సముదాయాలు 892 (షెటర్స్) విక్రయాలు**
- **జిల్లాలో 12 ప్రాంతాల్లో ఉన్న 2బిహెచ్‌కెల వద్ద గల వాటికి 15,17తేదీలలో వేలంకు ఏర్పాట్లు**
- **15, 17తేదీలలో వేలం నిర్వహిస్తాం - మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి వెల్లడి**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని 12 ప్రాంతాల్లో ఉన్న డబుల్‌బెడ్‌రూమ్స్ కాలనీల వద్ద గల వాణిజ్య సముదాయాలు 892 (షెటర్స్)ను విక్రయించటానికి ఈ నెల 15, 17తేదీలలో వేలం నిర్వహించటం జరుగుతుందని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు.

మంగళవారం ఆయన పేర్కొంటూ వీటి ద్వారా వచ్చె ఆదాయం ఆయా డబుల్‌బెడ్‌రూమ్స్ కాలనీల అభివృద్ధికి వినియోగిస్తామన్నారు. ఆ కాలనీల అభివృద్ధి పనులను ఆ కాలనీ సొసైటీ వారి ప్రతిపాదనలను అనుసరించి మున్సిపల్ కమిషనర్ ద్వారా నిర్మాణాలు చేపట్టబడుతాయన్నారు. ఈ కాలనీల్లోని వాణిజ్య సముదాయాలు 15వ తేదీన (బుధవారం రోజున) రాంపల్లి, చైతన్యనగర్, శ్రీరామ్‌నగర్, కొర్రెముల, చర్లపల్లి, 17వ తేదీన తూంకుంట, మురహరిపల్లి, అహ్మద్‌గూడ, కాలనీలలకు సంబంధించిన సముదాయాలను కీసర రెవెన్యూ డివిజనల్ ఆఫీస్‌లో వేలం నిర్వహించటం జరుగుతుందన్నారు.

అదే విధంగా 15న బుధవారం కైసర్‌నగర్, బాచుపల్లి, నిజాంపేట్, 17న దుండిగల్ కాలనీలు రెవెన్యూ డివిజనల్ ఆఫీస్ మల్కాజ్‌గిరి (ఆర్డీఓ) నందు వేలం నిర్వహించటం జరుగుతుందని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. వేలం రోజున ఉదయం 9గంటల నుంచి 11వరకు వేలం పాటలో పాల్గొనే వారు రూ.35వేల రూపాయల ఇఎండిని డిడి రూపంలో అధికారులకు సమర్పించాలన్నారు.

వేలం నోటిఫికేషన్‌లో పేర్కొన్న అప్‌సెట్ ధర మీద వేలం పెంపు ధర చదరపు అడుగుకు రూ.50గా నిర్ణయించబడినట్లు తెలిపారు. హెచ్1 అత్యధిక బిడ్డర్ ని ప్రకటించే ముందు కనీసం 3చెల్లుబాటు అయ్యే బిడ్‌లు అవసరం అవుతాయన్నారు.

ఒకే ఒక బిడ్ స్వీకరించబడవని అన్నారు. వేలం నొటిఫికేషన్లలో పేర్కొన్న వాణిజ్య షాపుల వేలం తేదీ నాటికి యధాతదంగా ఉన్న స్థితిలో విక్రయానికి అందజేయటం జరుగుతుందన్నారు. అత్యధిక బిడ్‌ను 3సార్లు ప్రకటించిన తరువాతనే వేలం ఖాయపడినట్లు అంతిమంగా ప్రకటించబడుతుందని అన్నారు.




మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి

బిడ్‌కు నిర్దిష్ట సమయ పరిమితి ఉండదు. స్వేచ్ఛగా పారదర్శకంగ వేలం నిర్వహించ బడుతుందన్నారు.

అత్యధిక వేలం పొందిన బిడ్డర్ రెవెన్యూ అధికారి నుంచి ఇంటిమెషన్ లెటర్ అందిన 30రోజులలోప మొత్తం బిడ్ మొత్తాన్ని చెల్లించాలి, చెల్లించటంలో విఫలం అయితే ఇఎండి విడుదల చేయబడదని స్పష్టం చేశారు.

## గ్రామీణ యువతలో నైపుణ్యాభివృద్ధికి ఉచిత శిక్షణలు

**-ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**-కురుమిద్దలో శిక్షణ పొందిన యువతకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవం**

**యాచారం,ఏప్రిల్ 14, ప్రభాతవార్త..**

యాచారం మండలం కురుమిద్ద గ్రామంలోని యంబి కర్మెల్ ప్రార్థనా మందిరంలో గత మూడు సంవత్సరాలుగా యువతీ యువకులకు ఉచితంగా అందిస్తున్న స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తి కావడంతో మంగళవారం సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్ రెడ్డి రంగారెడ్డి శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంగ్లీష్ మరియు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని, ఈ శిక్షణతో యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. ప్రతి గ్రామంలో ఇలాంటి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు కావాలని ఆకాంక్షిస్తూ, ప్రభుత్వ పరంగా అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. శిక్షణ పొందిన యువత తమ జీవితాల్లో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఉచిత కంప్యూటర్ శిక్షణలు భవిష్యత్తులో మరిన్ని నిర్వహించాలని సూచించారు. అనంతరం చర్చి పాస్టర్, సంఘస్తులను ఎమ్మెల్యే అభినందించారు.




సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి సర్పంచ్ శ్రీవిద్య శ్రీ రాములు

అంతకుముందు అంబేద్కర్ జయంతి సందర్భంగా డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యాచారం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ నీలం శ్రీవిద్య శ్రీరాములు, ఏసిపి కేవీపీ రాజు, సీనియర్ పాస్టర్ రెవరెండ్ జి.డేవిడ్ రాజ్, పాస్టర్ కె.దినాకర్, పాస్టర్ కె.రవీందర్, మాజీ ఉపసర్పంచ్ గోపాలి జోసెఫ్, సంఘం సీనియర్ సభ్యులు కల్లేపల్లి సోమలింగం, పి.పౌలు, జి.లక్ష్మయ్య, జి.రవికుమార్, ఎం.రామచంద్రి, కె.మహేందర్, కె. జాన్, బి.శ్యామ్, పి. రమేష్, టి.కిరణ్, జి.దేవదాస్, జి.కిరణ్, జి.మహేందర్, పి.గణేష్, పి.రమేష్, ఎం.మహేందర్, కె.లాజర్, కె.కృష్ణ, గ్రామ పాలకవర్గ సభ్యులు, సంఘస్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



క్రికెట్ మ్యాచ్ ప్రారంభిస్తున్న ఎంపిడివో రవి చందర్ రెడ్డి,తదితరులు

## యువత విద్యతోపాటు క్రీడారంగలలో రాణించాలి

**- క్రికెట్ మ్యాచ్ ను ప్రారంభించిన ఎంపిడివో రవి చందర్ రెడ్డి**

**కేశంపేట, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** నేటి యువత విద్యతోపాటు క్రీడారంగలలో రాణించాలని ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి అన్నారు. కేశంపేట మండల పరిధిలోని పోమల్ పల్లి బైర్కాన్ పల్లి గ్రామాలలో క్రికెట్ క్రీడాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువత చదువుతోపాటు క్రీడా రంగాలలో కూడా రాణించాలని గల్లి స్థాయి నుండి ఢిల్లీ స్థాయిలో ఆడేందుకు అవకాశం కల్పించిన కేంద్ర ప్రభుత్వం కల్పించిందని అన్నారు. ఈ టోర్నీ ద్వారా తెలంగాణలో ఉన్న మారుమూల గ్రామంలోని ఉన్న మట్టిలోని మాణిక్యాలు బయటపడతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఇన్చార్జిలు కంచుకోట మహేష్, కరెడ్ల నరేందర్ రెడ్డి, మున్నూరు యుగంధర్ మరియు బిజెపి నాయకులు రాఘవేందర్ రెడ్డి,దాసరి మహేష్, పవన్ కుమార్ మరియు క్రీడాకారులు పాల్గొన్నారు .

# ఊరూరా ఇందిరమ్మ ఇళ్లు

**-మండలానికి 510ఇళ్లు మంజూరు-ఇప్పటికే 120ఇళ్ల గృహాప్రవేశాల**

**-మరో 200ఇళ్లు ప్రారంభానికి సిద్దం-హార్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు**

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్, 14,(ప్రభాతవార్త):** ఇళ్లు లేని నిరుపేదలకు పక్క ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్న సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుంది. ఇందులో భాగంగానే గ్రామాలలో ఇళ్లు లేని ప్రజలను గుర్తించి నూతన ఇళ్లను మంజరు చేస్తుంది. ప్రభుత్వ అధికారులు గ్రామాలలో సర్వే నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. ఇళ్లు మంజరు అయిన వారికి ప్రభుత్వ నిభందనలు తెలిపి నూతన ఇంటి నిర్మాణం పనులు చేపడుతన్నారు. ఇళ్లు నిర్మాణం పనులు జరుగుతున్నదానికి అనుగునంగా ప్రభుత్వం నుంచి నిధులు మంజురు చేస్తున్నారు. విడతల వారిగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు డబ్బులు విడువల అవుతున్నాయి. నూతనంగ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ప్రారంబోత్సవ సమయంలో మండల కాంగ్రెస్ నాయకులు నూతన వస్త్రాలను అందజేస్తున్నారు.

***మండలానికి 510ఇళ్లు మంజూరు***

జిల్లెడు చౌదరిగూడ మండంలంలో 24గ్రామ పంచాయితీలు ఉన్నారు.

మండలంలోని ఆయా గ్రామ పంచాయితీలకు గాను 510ఇందిరమ్మ ఇళ్లు మంజురు అయినట్లు అధికారులు తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు 120ఇళ్లు పూర్తి స్థాయిలో నిర్మాణాలు జరిగి గృహ ప్రవవేశాలు అయ్యాయి. అలాగె మరో 200ఇళ్లు గృహ ప్రవవేశాలు చేసేందుకు ఇద్దంగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి డబ్బులు ఎప్పటికప్పుడు విడుదల కావాలడం వల్లన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణంపై ఆసక్తి చూపుతున్నారు.

***డబ్బులు వారి అకౌంట్లోకే***

జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాలలో నూతనంగ నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి విడుదల అవుతున్న ఐదు లక్షల రూపాయాలను నేరుగా వారి అకౌంట్లలో జమ చేస్తున్నారు..

దీంతో మద్యవర్తుల ప్రమేయం ఏమాత్రం లేదు. దీని వల్లన లబ్ధిదారులు ఎవ్వరికి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేకుండపోయింది, ఇళ్లు నిర్మాణం పనులు జరుగుతున్న దాన్నిబట్టి సంబంధిత అధికారులు బిల్లులు చేస్తారు. అధికారులు చేసిన బిల్లులు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతాయి. ఈ ప్రక్రియ వల్లన లబ్ధిదారులకు ఎంతో మేలు జరుగుతుంది.

***సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు***

నూతనంగ ఇందిరమ్మ ఇళ్లు మంజురు అయిన లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గత కొన్ని సంవత్సరాల నుంచి స్వంత ఇళ్లలేక ఎన్నో ఇబ్బందులు ఎవుర్కొన్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇందిరమ్మ ఇళ్లను మంజురు చేసి నిధులు విడుదల చేయడంలో ఎంతో సంతొషంగా ఉందని మండల వాసులు అంటూన్నారు. ఒక్కో ఇంటికి ఐదు లక్షల రూపాయలు మంజురు చేయడం ఎంతో హార్షించదగ్గ విషయమని తెలిపారు.

అభిప్రాయాలు

***ప్రభుత్వానికి రుణపడివుంటాను***



గాలిగూడ గ్రామంలో నూతనంగ నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు

నాకు గతంలో ఇళ్లు లేదు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాకు ఇందిరమ్మ ఇళ్లు మంజురు అయ్యింది. ప్రభుత్వం ఇచ్చిన డబ్బుతో నూతన ఇళ్లు నిర్మించుకున్నారు. నాకు ఇప్పుడు సొంత ఇళ్లు ఇంది. ప్రభుత్వం చేసిన సహకారాన్ని ఎప్పటికి మరచిఎపోలేను.

***జయమ్మ గాలిగూడ గ్రామం, జిల్లెడు చౌదరిగూడ మండలం***

***ఎన్నో ఏళ్ల కళ నెరవేరింది***

ఎన్నో సంవత్సరాల నుంచి ఎదురుచుస్తున్న కళ ఇప్పుడు నెరవేరింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాకు ఇళ్లు మంజురు చేసింది. దీంతో నేను కొత్తగా ఇళ్లు కట్టుకోగలిగాను. ఇళ్లు ఇప్పించిన అందరికి రుణపడివుంటాను.

***చెనగారి నవనీత, పద్మారం గ్రామం, జిల్లెడు చౌదరిగూడ మండలం***

***ఇళ్లు వస్తదని అనుకోలేదు***

ఇంతకు మందు ఎప్పుడు కూడ కాను ఇళ్లు వస్తదని అనుకోలేదు. కాని కాంగ్రెస్ ప్రభుత్వంలో నాకు ఇందిరమ్మ ఇళ్లు వచ్చింది. నాకు చాల సంతోషంగా ఉంది. నేను కొత్తగా ఇళ్లు కట్టుకుంటున్నారు. మాచారం అమృత, పద్మారం గ్రామం, జిల్లెడు చౌదరిగూడ మండలం.

# రైతులను ఆదుకుంటున్నాం

**పడకల్లో మొక్కజొన్న, సన్నవర్, వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు**

**కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**తలకొండపల్లి ఏప్రిల్ 14, ప్రభాతవార్త:**

రాష్ట్రంలోని రైతులందరినీ ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మంగళ వారం నాడు తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామంలో సింగల్ విండో ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కజొన్న, వరి, సన్నవర్ ,కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల మేలు కోసం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. మొక్కజొన్న వరి సన్నవర్ రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు రైతులకు మద్దతు ధరఇస్తుందన్నారు. రైతులందరికీ గత ప్రభుత్వం మరిచిన సబ్సిడీతో పనిముట్లను అందజేస్తున్నామని, వరి కొనుగోలు చేసి 500 బోనస్ అందజేస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజలకు అవసరమైన అర్హులైన వారందరికీ ఇందిర ఇండ్లు మంజూరు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి, స్థానిక సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి, లింగరావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి, అమంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నరసింహ, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, నాయకులు జోగు రమేష్, డైరెక్టర్ శ్యామ్ సుందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు రమాదేవి, జగ్గారెడ్డి, డేవిడ్, రేన్ రెడ్డి, యాదయ్య తోపాటు ఆ గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# టివీవీ ఆధ్వర్యంలో ట్రై సైకిల్ పంపిణీ...

**దుద్యాల్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గౌరారం గ్రామంలో పేద కుటుంబానికి చెందిన నడవలేని దయనీయ స్థితిలో ఉన్న ఒక వికలాంగుడి జీవితంలో వెలుగులు నింపే మానవతా కార్యక్రమాన్ని తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు చేపట్టారు. దాతల సహకారంతో ట్రైసైకిల్‌ను అందజేశారు. ఇతరులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆ వికలాంగుడికి ఈ ట్రైసైకిల్ అందించడం ద్వారా అతని జీవితంలో ఆత్మవిశ్వాసాన్ని నింపినట్లు అయిందన్నారు. విద్యావంతుల వేదిక నాయకులు రవీందర్ గౌడ్, బాకారం చంద్రశేఖర్, గౌరారం గోపాల్, పల్నాటి అనిల్ కుమార్, మండల విద్యాధికారులు హరిలాల్, రామ్ రెడ్డి, మహిళా మణులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజంలో అణగారిన వర్గాల కోసం ముందుకు రావడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మనం చేసే చిన్న సహాయం కూడా ఒకరి జీవితాన్ని మార్చగలదని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవతా విలువలను పెంపొందిస్తాయని, అందరూ దాతృత్వంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సేవా కార్యక్రమం ద్వారా విద్యావంతుల వేదిక నాయకులు సమాజానికి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కిష్టి బాయి, మాజీ సర్పంచ్ చాంద్ పాషా, ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లు గ్రామ పెద్దలు యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ట్రై సైకిళ్ళు పంపిణీ చేస్తున్న నాయకులు

## చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**-మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య**

**వికారాబాద్, ప్రభాతవార్త :** ప్రజలు వేసవి ఎండ వేడిని తట్టుకోవడానికి చలివేంద్రన్ని ఉపయోగించుకోవాలని మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం. అనన్య అన్నారు. మంగళవారం వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ముందు మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులకు, పట్టణ ప్రజలకు ఉపయోగకరంగా ఉండేందుకు స్వర్గీయ గడ్డం. శైలజమ్మ జ్ఞాపకార్థం చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల అవసరాల నిమిత్తం ఎండాకాలం ప్రజలకు చల్లని నీరు అందించడం మంచి సేవ కార్యక్రమం అని అన్నారు. వికారాబాద్ రైతు బజార్ లో, కూరగాయల మార్కెట్ (బీట్ల ) వద్ద 3 చోట్ల ఈ చలి వేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మల్లేశం, సెక్రటరీ ఫాసియొద్దీన్, డైరెక్టర్ లు రాజునాయక్, పాపిరెడ్డి, నాయకులు విజయ్, నరేందర్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య

## మేకల కొట్టం దగ్ధం

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్, 14,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఇంద్రానగర్ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు మెకల కొటాన్ని దగ్ధం చేశారు. గ్రామానికి చెందిన రాగుల మంజుల తన వద్ద ఉన్న నాలుగు మెకలను కొటం లో కట్టి వేశారు. సోమవారం అర్ధరాత్రి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు మెకల కొటానికి నిప్పంటించారు. దీంతో కొటంలో ఉన్న రెండు మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో రెండు మేకలు గాయపడ్డాయి. బాధితురాలు ఇచ్చిన ఫీర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,


పూడూరులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న సర్పంచ్ ఖిజర్‌పాష,తహశీల్దారు విజయ్‌కుమార్,నాయకులు తదితరులు


కోట్‌పల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ జయంతి వేడుకలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నర్సింగ్‌నాయక్ తదితరులు


మోత్కుపల్లి గ్రామంలో అంబేద్కర్ జయంతి వేడుక సందర్భంగా అయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు ఆర్పిస్తున్న గ్రామ సర్పంచు బైండ్ల అమృతమ్మ నారాయణ.


ఆమనగల్లులో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి


ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో నివాళి అర్పిస్తున్న వైద్యులు,సిబ్బంది.


కరీంపూర్ గ్రామంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా గ్రామంలో వీధులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


కరీంపూర్ గ్రామంలో అంబేద్కర్ జయంతి వేడుకలో పాల్గొని మాట్లాడుతున్న బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సుందరి అనిల్


ఆర్కపల్లిలోచిత్రపటానికి పూలమాలలు అర్పిస్తున్న సర్పంచ్


రాంరెడ్డిపల్లిలో...


ముజాహిద్‌పూర్ గ్రామంలో..


పిరంపల్లి గ్రామంలో..


కందుకూరులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేస్తున్న నాయకులు


అంగన్‌వాడీ టీచర్లకు ఫోన్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి


జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశ్, సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదితరులు.


చౌడపూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ నివాళులర్పిస్తున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు,సర్పంచ్‌లు,ఇతన నేతలు .


అలియాబాద్ మున్సిపల్ కేంద్రంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి.పాల్గొన్న వైస్‌చైర్మన్,కమిషనర్, కౌన్సిలర్లు,నాయకుల దృశ్యం


మూడుచింతలపల్లి మున్సిపాల్టీలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన మున్సిపల్ చైర్మన్ జాము రవి, పాల్గొన్న ప్రజాప్రతినిధులు, తదితరుల దృశ్యం


దేవరయాంజాల్‌లో అంబేద్కర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, నాయకులు రాంమోహన్, శంకర్‌గౌడ్ తదితరుల దృశ్యం


కేశవరంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన మేడ్చల్ ఎంఎసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, కౌన్సిలర్ బి.మల్లేశ్‌యాదవ్, నాయకులు కె.భూమేశ్‌గౌడ్, బాల్‌రామ్‌గౌడ్, యూసుఫ్ తదితరుల దృశ్యం


జగ్గంగూడలో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకలు పాల్గొన్న మేడ్చల్ ఎంఎసి మాజీ వైస్‌చైర్మన్ ఇర్రి రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ జంగారెడ్డి, పాల్గొన్న తదితరుల దృశ్యం


పంచాయతి కార్యాలయంలో అంబేద్కర్ చిత్ర పటానికి మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం.


అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ.


విగ్రహానికి పూల మాలలు వేసి కేక్ కట్ చేస్తున్న దృశ్యం.

# ఊరూరా అంబేద్కర్ జయంతి

## బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి అంబేద్కర్

**రిజర్వేషన్లతోనే ఉద్యోగ కల్పన, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,**
**మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్**

**కడ్తాల్, ఏప్రిల్ 14, ప్రభాత వార్త :** భారత రాజ్యాంగ రూపకర్త, భారతరత్న అంబేద్కర్ కృషి చిరస్మరణీయంగా మిగిలిపోతుందని, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేద్దామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌లు పిలుపునిచ్చారు. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని కడ్తాల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్‌లు వేరువేరుగా విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయకంటి బిక్షపతి, అమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నరసింహ, డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, వైస్ చైర్మన్ గుడురు భాస్కర్ రెడ్డి, మండల ప్రజాప్రతినిధులు అధికారులు అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలి

**పూడూరు,ఏప్రిల్ 14, ప్రభాతవార్త :** భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని తహశీల్దారు విజయ్‌కుమార్,మండల సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులు,స్థానిక సర్పంచ్ ఖిజర్‌పాష పేర్కొన్నారు.డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా మంగళవారం పూడూరు మండల కేంద్రంలోని బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళ్లు అర్పించారు.అంబేద్కర్ కులమతాలకు అతీతంగా,ధనిక,పేద వర్గాలకు సమన్యాయం చేకూర్చాలన్న సదుద్దేశంతో తరతరాలకు ఉపయోగపడే విధంగా భారత రాజ్యాంగాన్ని నిర్మించడంలో కీలకపాత్ర పోషించడం గర్వించదగ్గ విషయమన్నారు.అనంతరం రోడ్డు ప్రమాదాల భద్రతపై ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ మాజీ చైర్మన్,జిల్లా కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి,ఎంపిడిఓ పాండు,ఎంపిఓ సుందర్,ఎంపిడిఓ సూపరింటెండెంట్ శివప్రకాష్,నాయకులు అనంత రాములు,శ్యాంసుందర్‌రెడ్డి, రమేష్,తదితరులు పాల్గొన్నారు.

**కోట్‌పల్లి మండల కేంద్రంలో ...**

**కోట్‌పల్లి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** కోట్‌పల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్ అధ్వర్యంలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు ఆర్పించారు. విగ్రహాన్ని పూలతో అలంకరించి, శోభాయమానంగా తీర్చిదిద్దిన ప్రాంగణంలో కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. అంబేద్కర్ దేశానికి అందించిన రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిన గొప్ప గ్రందమని కొనియాడారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, యువత, తదితరులు పాల్గొన్నారు.

**అంబేద్కర్ జీవితం స్పూర్తిదాయకం**
**మోత్కుపల్లి గ్రామ సర్పంచు బైండ్ల అమృతమ్మ నారాయణ**

**కోట్‌పల్లి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ జీవితం నేటి తరానికి స్పూర్తిదాయకమని మోత్కుపల్లి గ్రామ సర్పంచు బైండ్ల అమృతమ్మ నారాయణ అన్నారు. మంగళవారం నాడు వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలలో సందర్భంగా అయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు ఆర్పించారు. ఈసందర్భంగా అమె మాట్లాడుతూ. దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించిన ఘనత అంబేద్కర్‌కే దక్కుతుందన్నారు. స్వేచ్ఛ, సమానత్వం కోసం అయన చేసిన దేశ స్వపరిపాలనకు ఆదర్శంగా నిలిచేలా రాజ్యాంగాన్ని రూపొందించడం అయన గొప్పదనమన్నారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని అమె పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచు పి, మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, కారోబార్ అశోక్, కె.చంద్రయ్య, కె.గోపాల్, బైండ్ల సురేందర్, కె,నర్సిములు, తదితరులు పాల్గొన్నారు.

**కోట్‌పల్లి మండల పరిధిలోని కరీంపూర్ గ్రామంలో..**

**కోట్‌పల్లి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త;** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సుందరి అనిల్ అన్నారు. మంగళవారం నాడు వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల పరిధిలోని కరీంపూర్ గ్రామంలో ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135,వ జయంతి వేడుల ఘనంగా నిర్వహించి అయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు ఆర్పించారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ. భాతర రాజ్యాంగ ప్రధాన రూపశిల్పి, గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. అంబేద్కర్ ఆశయాలను సాధిస్తూ అయన అడుగుజాడల్లో నడువడమే అంబేద్కర్‌కు మనమిచ్చే గొప్ప నివాళులు అన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ షబానా బీ సదత్,ఉప సర్పంచ్ మైసయ్య,వార్డు సభ్యులు,ఫీల్డ్ అసిస్టెంట్ షేర్‌అల్లి, బీఆర్ అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### దేశ నిర్మాణంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పాత్ర కీలకం

**ఆమనగల్లు, ఏప్రిల్14, ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మంగళవారం ఆమనగల్లు మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఘనంగా జరిగాయి. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గల అంబేద్కర్ విగ్రహానికి కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డితో పాటు మున్సిపాలిటీ చైర్మన్ నేనావత్ పత్యనాయక్, మార్కెట్ కమిటి చైర్మన్ యాటగీతనర్సింహ్మా, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఒగ్గు మహేశ్ అధ్యక్షతన అంబేద్కర్ స్థలి వద్ద భారీ ఏర్పాట్లు చేశారు.

కార్యక్రమంలో అధికారులు ఎంపిడిఓ కుసుమ మాధురి, ఎస్‌హెచ్ఓ వెంకటేశ్వర్లు, అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులు ఒగ్గు మహేశ్, గోరటి దేవేందర్, హాఫీజ్, పులికంటి మైసయ్య, టిపిసిసి సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు ఎర్రవోలు మహేశ్, మొక్తాల వెంకటయ్య, అనుమలు రమేశ్, నాగిళ్ళ జగన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా ముదిరాజ్, గుర్రం కేశవులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తెల్గమళ్ళ జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, కృష్ణానాయక్ తదితరులు ఉన్నారు.

**మాడ్గులలో....**

మాడ్గుల మండలంలోని వివిధ గ్రామలలో భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు,సంఘంల నాయకులు అంబేద్కర్ విగ్రహం,చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఆర్కపల్లి గ్రామ పంచాయతీలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కళ్ల భాగ్యలక్ష్మితిరుపతిరెడ్డి,ఉప సర్పంచ్ తోలు రవీందర్,పాల్గొన్నారు. అనంతరం ఆసిరెడ్డిపల్లి నుంచి ఆర్కపల్లి ఉన్నత పాఠశాల వరకు బైక్ ర్యాలీ నిర్వహించి,అంబేద్కర్ ఆశయాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేశారు.

**సంస్కరణలకు ఆద్యుడు అంబేద్కర్**
**సర్పంచ్ కోస్గి నరసింహులు యాదవ్**

**కుల్కచర్ల,ఏప్రిల్,14 ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ సంస్కరణలకు ఆద్యుడని సర్పంచ్ కోస్గి నరసింహులు యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో అంబేద్కర్‌జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మయ్య గౌడ్,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మహిళ సంఘాల మహిళలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**ముజాహిద్‌పూర్ గ్రామంలో....**

రాజ్యాంగా నిర్మాతగా భారతీయుల గుండెల్లో చిరస్థాయిగా ఎప్పటికి నిలిచిపోయిన మహనీయుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని సర్పంచ్ చంద్రభూపాల్ రావు అన్నారు.ముజాహిద్‌పూర్ గ్రామంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అంబేద్కర్ బడుగు, బలహినవర్గాల, దళితుల సంక్షేమం కోసం పోరాడిన యోధుడని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ ఆంజనేయులు, వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**పిరంపల్లి గ్రామంలో...**

ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ అడుగు జాడల్లో నడవాలని సర్పంచ్ గడ్డం వెంకటయ్య అన్నారు.మంగళవారం మండల పరిధిలోని పిరంపల్లి గ్రామంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ, ఉప సర్పంచ్ శాంత మొగులయ్య,సినియర్ నాయకులు మురళీకృష్ణ, ఫిల్డ్‌అసిస్టెంట్ వెంకటయ్య,కె. శ్రీనివాస్, రమేష్, నర్సింలు,గ్రామ యువకులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

**కుల్కచర్ల.....**

కుల్కచర్ల, మండల వ్యాప్తంగా గ్రామాలలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాలల్లో ఆయా గ్రామల సర్పంచులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

**కందుకూరు మండలంలో ..**

**అణగారిన వర్గాల నుండి మల్లె పువ్వుల వికసించిన అంబేద్కర్**

**కందుకూరు, ఏప్రిల్ 14,ప్రభాతవార్త:** కందుకూరు మండలంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను కన్నుల పండుగలా అన్ని వర్గాల ప్రజలు జరుపుకున్నారు. మహనీయులు రాజ్యాంగనిర్మాత అంబేద్కర్ విగ్రహాలకు అధికారులతో పాటు రాజకీయ పార్టీల నాయకులు యువజన సంఘాలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారి ఫ్యూచర్ సిటీ క్రాస్ రోడ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు యువజన సంఘాల ప్రతినిధులు తమకు సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహాల వద్ద జయంతి వేడుకలను జరుపుకున్నారు.

**అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం**
**- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**
**అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు అందజేత**

**పరిగి ఏప్రిల్ 14 ప్రభాతవార్త :** అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ, ఆయన స్ఫూర్తితో బడుగు బలహీన వర్గాల ఎదుగుదలకు తోడ్పాటు నందిస్తానని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తెలిపారు.మంగళవారం భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా పరిగి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి ఆయన నివాళులు అర్పించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సమాజంలో అణగారిన వర్గాల అభివృద్ధి కోసం రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని,ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమానత్వం, సామాజిక న్యాయం సాధనకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు.

అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్ సేఫ్టీపై ప్రతిజ్ఞ చేశారు. అగ్నిమాపక సిబ్బంది సేవలను మెచ్చుకున్నారు.. అంబేద్కర్ స్ఫూర్తితో పరిగి ప్రాంత ప్రజలకు అన్ని రంగాలల్లో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.విద్య,వైద్యం,గ్రామాల అభివృద్ధి , రోడ్లు,రైల్వే లైన్లు, నేవి రాడార్ లాంటి ప్రాజెక్టులతో అందరికి ఉపాధి కల్పించేలా ప్రభుత్వం నుంచి పనులు చేపడతానని ఎమ్మెల్యే టి.ఆర్.ఆర్. పేర్కొన్నారు.

**చౌడాపూర్‌లో..**

**చౌడపూర్ ఏప్రిల్ 14 ప్రభాతవార్త :**

భారతరత్న డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా చౌడపూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం బైక్ ర్యాలీ చేపట్టి , సమావేశంలో పలువురు అంబేద్కర్ సేవల గురించి మాట్లడారు.మండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు అశోక్, గ్రామ సర్పంచ్ పరిగి నవీన్ కుమార్,గ్రామ అంబేద్కర్ సంఘ అధ్యక్షులు కర్ణాకర్,మందిపాల్ సర్పంచ్ నాగరాజ్ యాదవ్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అశోక్ , చౌడాపూర్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి,,,బిజెపి పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ ,మండల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

**శామీర్‌పేట ఉమ్మడి మండలంలో**

**శామీర్‌పేట, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:**

శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాల్లో రాజ్యాంగ నిర్మాత,బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో, అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాల్టీలల్లోని వివిధ వార్డులలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి,కమిషనర్ చంద్రశేఖర్, మేడ్చల్ ఎ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, పలువురు కౌన్సిలర్లు, పలువురు నాయకులు కె.లింగం, పలువురు కౌన్సిలర్లు గాదె వెంకటేశ, ఎస్.జశ్వంత్‌రెడ్డి ఎస్.వనజఅశోక్‌రెడ్డి,మరి కొందరు కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, పట్టణ నాయకులు, దళితసేన, అంబేద్కర్ సంఘాల నాయకులు పలువురు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శామీర్‌పేట గ్రామంలో బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జయంతి సందర్భంగా పలువురు నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు వి.సుదర్శన్, ఎం.మహేందర్‌యాదవ్, నాయకులు బి.వెంకటేశ, బి.రవి, రాజు, నర్సింగ్‌రావు, చారి, పలువురు నాయకులు,యువకులు పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అదే విధంగా కేశవరం వార్డు కార్యాలయం వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, వార్డుల కౌన్సిలర్లు బి.మల్లేశ్‌యాదవ్, కె.మాదవిభూమేశ్‌గౌడ్, నాయకులు బాల్‌రామ్‌గౌడ్, టి.నరేందర్‌గౌడ్, యూసుఫ్, టి,రాములుగౌడ్, చిత్తారియాదవ్, ఉడుతల కృష్ణ, కె.సాయికుమార్, రాజు, అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు, పలువురు నాయకులు, యువకులు పాల్గొని నివాళులు అర్పించి అంబేద్కర్ సేవలను కొనియాడారు. తూంకుంటలో అంబేద్కర్ విగ్రహం వద్ద జయంతి వేడుకలు జరిగాయి. దీనిలో మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్, పలువురు నాయకులు రవీందర్‌గౌడ్, చారి, గిరి, ప్రవీణ్‌గౌడ్, మల్లేశ్‌యాదవ్, పలువురు నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు. దేవరయాంజాల్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచు టి.శంకర్‌గౌడ్, దళితసమాఖ్య అధ్యక్షులు బిఎన్.రాంమోహన్, నర్సింహ్మారెడ్డి, మురళీగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, పి.లక్ష్మినారాయణ, హరిగోపాల్, జనార్ధన్, నర్సింగ్‌రావు, సాయికుమార్.కె.సుదాకర్‌రెడ్డి, ఆర్టీఏ ఇన్స్‌పెక్టర్ కిరణ్‌కుమార్, పలువురు నాయకులు పాల్గొని అంబేద్కర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. పోతాయిపల్లిలో అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, బి.వెంకటేశ, ప్రవీణ్‌రావు, బి.నర్సింగ్‌రావు, రాజుయాదవ్, జె.నాగేశ్, హరిగౌడ్, తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ ఆలోచనలను ప్రతి ఒక్కరు ఆచరణలో పెట్టాలన్నారు. జగ్గంగూడలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కౌన్సిలర్ జంగారెడ్డి,మేడ్చల్ ఎంఎసి మాజీ వైస్‌చైర్మన్లు ఇర్రి రవీందర్‌రెడ్డి, నాగరాజుగుప్త, మాజీ ఉపసర్పంచు బుద్ది శ్రీనివాస్, పలువురు నాయకులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. అదే విధంగా మూడుచింతలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని అద్రాస్‌పల్లిలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జాము రవి, కమిషనర్ పవన్‌కుమార్,అద్రాస్‌పల్లిలోని వార్డుల కౌన్సిలర్లు అజయ్‌కుమార్, ప్రభాకర్, మాజీ ఉపసర్పంచు జహంగీర్, పలువురు నాయకులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. పలువురుని సన్మానించి మమోంటోలను అందజేశారు. అదే విధంగ మున్సిపాల్టీ పరిధిలోని మూడుచింతలపల్లి, లక్ష్మాపూర్, అనంతారం, కొల్తూర్, నారాయణపూర్, కేశవరం, జగ్గంగూడ, ఉద్దెమర్రి, అద్రాస్‌పల్లి, పొన్నాల్, కేశ్వాపూర్ గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి పాల్గొని అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆ యా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో కౌన్సిలర్లు, నాయకులు, అంబేద్కర్ సంఘాల నాయకులు, దళితసేన నాయకులు పలువురు వివిధ పార్టీల నాయకులు పాల్గొని అంబేద్కర్‌కు నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు.

**పోచారం డివిజన్‌లో**

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 14,ప్రభాత వార్త:** పోచారం డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. పోచారం డివిజన్ నారపల్లి, చౌదరిగూడ అన్నోజిగూడ, యంనంపేట్, కొర్రెముల, రాజీవ్ గృహకల్ప కాలనీ, ప్రతాప సింగారం, కాచవాని సింగారం తదితర గ్రామాల్లో బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా విగ్రహానికి అన్ని పార్టీల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. నారపల్లిలో జరిగిన అంబేద్కర్ జయంతి సందర్భంగా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కే. వినోద్ ఆధ్వర్యంలో తదితరులు పాల్గొన్నారు. అన్నోజిగూడ లక్ష్మీనర్సింహ కాలనీలో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి పాల్గొని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


అన్నోజిగూడలో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ బి. కొండల్‌రెడ్డి.

## మహనీయుడు అంబేద్కర్

**మోమిన్‌పేట్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ నిర్మాత, న్యాయకోవిదుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి, సామాజిక విప్లవకారుడు, మానవుడే మహనీయుడు అవుతాడని చాటిచెప్పిన మహనీయుడు, ఆయన పుస్తకం భారతదేశాభివృద్ధికి వికాసం, అంతరాయం లేని భారతీయ సమాజం కోసం పరితపించి, భారత రాజ్యాంగ రూపకల్పన చేసిన మహనుబావుడు భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 135వ, జయంతిని పురస్కరించుకొని మంగళవారం మోమిన్‌పేట్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో గ్రామ పంచాయతి కార్యాలయాల యందు పంచాయతి సర్పంచులు కేక్ కట్ చేసి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ప్రధాన వీధులలో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిదంగా రోడ్డు ప్రమాదాల నిర్మూలనకొరకు సామూహిక ప్రతిజ్ఞ చేసి, అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి జైభీం అంటు నినాదాలతో బైక్ ర్యాలి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు, ఆయా గ్రామాల సర్పంచులు, గ్రామ పాలక వర్గాలు, మండలస్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు, అంగన్వాడి టీచర్లు, యువకులు, ఆయా గ్రామాల పంచాయతి కార్యదర్శులు, పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని కాపాడటానికి నడుం బిగించాలి

**రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షినటరాజన్**
**మేడ్చల్‌లో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు**
**సహపంక్తి భోజనం**

**మేడ్చల్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త :** రాజ్యాంగం మీద జరుగుతున్న దాడులను ఎదుర్కొనే సమయం వచ్చిందని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్ పట్టణంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వ హించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మీనాక్షి నటరాజన్ ముందుగా అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పట్టణంలోని కిందిబస్తీలో నిర్వహించిన సహపంక్తి భోజనంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాజ్యాంగ విలువలను కాపాడటం ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉన్న చారిత్రక బాధ్యత అని తెలిపారు. రాజ్యాంగం మీద దాడులు జరుగుతుంటే మౌనంగా చూస్తూ ఊరుకోవడం ప్రమాదకరం అన్నారు.రాజ్యాంగం అంటే పుస్తకం కాదని దేశానికి ప్రాణమని, ఆ ప్రాణం మీదే ఇప్పుడు దాడులు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు మౌనంగా ఉండకుండా వీధుల్లోకి వచ్చి రాజ్యాంగాన్ని


మేడ్చల్ పట్టణంలోని కిందిబస్తీలో నిర్వహించిన సహపంక్తి భోజనం కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్

కాపాడాల్సిన సమయం వచ్చిందని అన్నారు. కుల నిర్మూలనా భావజాలం సమాజాన్ని మార్చే ఆయుధమని అన్నారు. అంబేద్కర్ రచించిన కుల నిర్మూలన గ్రంథం ఓ పుస్తకం కాదని, అది సమాజాన్ని కదిలించే శక్తి అని, కులవివక్షను పూర్తిగా నిర్మూలించాలంటే ప్రతి ఇంటికి ఈ భావజాలం చేరాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రతి కార్యకర్త ఈ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే నిజమైన రాజకీయ పోరాటమని అన్నారు. దేశానికి రాజ్యాంగాన్ని రచించే బాధ్యత ఎవరికివ్వాలనే ప్రశ్న వచ్చినప్పుడు మహాత్మా గాంధీ స్వయంగా అంబేద్కర్ పేరును సూచించారని, దేశాన్ని నిర్మించే దూరదృష్టి ఆయనకే ఉందనే విషయాన్ని నమ్మారని చెప్పారు. అంబేద్కర్ ఆలోచనలు, గాంధీజీ విలువలు భారత దేశానికి బలమైన పునాదని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని కాపాడటానికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఒక సైనికుడిలా ముందుండాలని, సామాజికిక న్యాయం కోసం పోరాటం ఆగకూడదన్నారు. అంబేద్కర్ కలలు సాకారం కావాలంటే కాంగ్రెస్ బలంగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, సమాజంలో సమానత్వం, న్యాయం, సహోదర భావం నెలకొల్పడమే అంబేద్కర్ ఆశయమని పేర్కొన్నారు. అంబేద్కర్ చూపిన మార్గంలో నడవడమే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, కూకట్పల్లి ఇంచార్జ్ బండి రమేష్, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్, జిల్లా ఒబిసి సెల్ అధ్యక్షుడు రవి ముదిరాజ్, గారు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పత్తి కుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజనోళ్ళ లక్ష్మి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు గణేష్ నాయక్, గుండ్లపోచంపల్లి, మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, సాయిపేట శ్రీనివాస్, నాయకులు రాఘవేందర్ గౌడ్, చీర్ల రమేష్, చాప రాజు, శేకర్ గౌడ్, వెంకటేష్, మల్లేష్ గౌడ్, దేవ, రాజు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.